www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 30 ఏప్రిల్ 2024
8 పేజీలు





ఏలూరు పశ్చిమ గోదావరి

నిర్వాసితులను నిండా ముంచారు

బిజెపి, టిడిపి, వైసిపిలపై పిసిసి అధినేత షర్మిల ఆగ్రహం

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

సిపిఎం, సిపిఐ నేతలు పిలుపు



సభలో మాట్లాడుతున్న సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి, కొయ్యలగూడెం


పోలవరం ప్రాజెక్టు పేరుతో నిర్వాసితులను నిండా ముంచారని బిజెపి, దానితోక పార్టీలు టిడిపి, జనసేన, వైసిపిలపై పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం పూర్తి చేయాలన్నా, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలన్నా ఇండియా వేదిక అభ్యర్థులను బలపర్చి గెలిపించాలని కోరారు. ఎపి న్యాయయాత్రలో భాగంగా సోమవారం సాయంత్రం పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం నాలుగు రోడ్ల కూడలిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. గత 10 సంవత్సరాలుగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో హడావుడి చేస్తూ దాన్ని టిడిపి, వైసిపి ఎటిఎంగా మార్చు కున్నాయని, నిర్వాసితులను మాత్రం గాలికొదిలేశారని విమర్శించారు. పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు నియోజకవర్గ అభివృద్ధిని మరిచి ఇసుక, మట్టి మాఫియాలను పెంచి పోషించాడన్నారు. నియోజకవర్గంలో ఆయనపై వ్యతిరేకత రావడంతో భార్యకు సీటు తెచ్చుకోవడం ..6లో

కొల్లేరు ప్రజలకు అండగా ఉంటాం..

రీసర్వే చేసి రైతులకు 10 వేల ఎకరాలందిస్తాం

ఆక్వాతో దెబ్బతిన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

గణపవరం, తాడేపల్లిగూడెం సభల్లో పవన్‌కళ్యాణ్



గణపవరం సభలో మాట్లాడుతున్న టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, గణపవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు

కొల్లేరు ప్రజలు కాంటూరు సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొల్లేరు రీసర్వే చేసి కాంటూరు లెక్కలు తేలిస్తే పది వేల ఎకరాలు రైతులకు అందుతాయని, కూటమి అధికారంలోకి రాగానే కొల్లేరు ప్రజలకు అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తామని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఉంగుటూరు నియోజకవర్గం గణపవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. సాయంత్రం 5.30 గంటలకు హెలీకాప్టర్‌లో గణపవరంలోని మహాలక్ష్మి థియేటర్ ..6లో

ఇక సమరమే..!

ఏలూరు, పశ్చిమ జిల్లాల్లో బరిలో 209 మంది అభ్యర్థులు

నరసాపురం ఎంపీ స్థానానికి 21 మంది, ఏలూరు ఎంపీ సానానికి 13 మంది పోటీ

14 అసెంబ్లీ స్థానాల్లో 175 మంది అభ్యర్థులు

నూజివీడులో తప్పకున్న టిడిపి రెబల్ ముద్దరబోయిన

ఉండిలో పోటీలోనే టిడిపి రెబల్ శివరామరాజు

హోరెత్తనున్న ప్రచారం

ముగిసిన నామినేషన్ల పర్వం

ప్రజాశక్తి - భీమవరం, ఏలూరు

పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారం ముగిసింది. ఈ నెల 18 నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ 25 తేదీ వరకు సాగింది. 26న నామినేషన్ల పరిశీలన, విత్‌డ్రా అనంతరం నామినేషన్ల ఉపసంహరణ కొనసాగింది. పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు పశ్చిమగోదావరి జిల్లా మొత్తంగా కేవలం పది మంది అభ్యర్థులు మాత్రమే నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈ నేపథ్యంలో నరసాపురం పార్లమెంటు స్థానానికి 21 మంది అభ్యర్థులు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్థానాల్లో 89 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నరసాపురం పార్లమెంటు స్థానానికి 21 మంది అభ్యర్థుల నామినేషన్లను జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ఆమోదించారు. అయితే అభ్యర్థులెవ్వరూ నామినేషన్లను ఉపసంహరించుకోకపోవడంతో 21 మంది అభ్యర్థులు పోటీలో నిలిచినట్లు ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ప్రకటించారు.

ఆచంట నియోజకవర్గంలో స్క్రూట్నీ అనంతరం 11 మంది నామినేషన్లను ఆమోదించారు. నామినేషన్ల ఉపసంహరణలో భాగంగా స్వతంత్ర అభ్యర్థులు భోగి గోపాలకృష్ణ, చికిలే కృష్ణబాబు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 9 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

పాలకొల్లులో 16 మంది నామినేషన్లను ఆమోదించగా స్వతంత్ర అభ్యర్థి జి.నవీన్‌కుమార్ నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో ఈ స్థానంలో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.


నరసాపురంలో 12 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. స్వతంత్ర అభ్యర్థి బొమ్మిడి సునీల్ నామినేషన్ ఉపసంహరించుకోవడంతో 11 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

భీమవరం నియోజకవర్గంలో 17 నామినేషన్లను ఆమోదించగా ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు అంకెం వెంకటరమణ, పులపర్తి సత్యవాణి నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ స్థానంలో 15 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు.

ఉండిలో 17 మంది నామినేషన్లను ఆమోదించారు. భారతీయ చైతన్య యోజన పార్టీకి చెందిన గుడిగంట వెంకటేశ్వరరావుతోపాటు మరో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు ఇందుకూరి నవీన్‌వర్మ రాజు, వేగేశ్న సూర్యనారాయణరాజు, తోటకూర సుధీర్‌వర్మ తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో ఈ స్థానం లో 13 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు.

తణుకులో 13 మంది నామి నేషన్లను ఆమోదించారు. అయితే ఏఒక్కరూ నామి నేషన్లు ఉపసంహరించుకోకపోవడంతో ..6లో

నేడు దెందులూరులో చంద్రబాబు పర్యటన



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మంగళవారం దెందులూరులో పర్యటించనున్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్లో బయలుదేరి మధ్యాహ్నం మూడు గంటలకు దెందులూరులోని ఎస్ఎంఆర్ నగర్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం తిరిగి హెలికాప్టర్లో బయలుదేరి విజయవాడ చేరుకుంటారు.

నేడు కొయ్యలగూడెంలో పవన్‌కళ్యాణ్ సభ



ప్రజాశక్తి - కొయ్యలగూడెం

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మంగళవారం ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన మంగళవారం సాయంత్రం 5.40 గంటలకు పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం సమీపంలోని గవరవరంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు హెలికాప్టర్‌లో చేరుకుంటారు. అక్కడ నుంచి కన్నాపురం రోడ్డులో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకుని సభలో మాట్లాడతారు. పవన్ సభకు పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు.

భలే మంచి బేరం..!

మధ్యపేజీల్లో..

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

8లో..

రాజ్యాంగ మౌలిక సూత్రాలపై దాడిని వ్యతిరేకించండి

8లో..

పింఛన్ కోసం సచివాలయానికి రానక్కర్లేదు

పింఛనదారుని ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ

విభిన్నప్రతిభావంతులు, తీవ్ర వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దే పంపిణీ

ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్



ప్రజాశక్తి - ఏలూరు

మే ఒకటో తేదీన సామాజిక పెన్షన్ల కోసం ఏఒక్క పింఛన్‌దారుడు సచివాలయానికి రానవసరం లేదని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. సామాజిక పెన్షన్లకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో 2,69,886 మంది పెన్షన్‌దారులకు రూ.80.63 కోట్లు రెండు విధానాల ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. వాటిలో ఒకటి పింఛన్‌దారుని ఆధార్ కార్డుకు అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు నేరుగా డిబిటి ద్వారా జమ చేస్తారన్నారు. ఈ విధంగా 2,05,548 మందికి రూ.61.67 కోట్లు నగదు జమ చేస్తారన్నారు. ఇది ఆధార్ కార్డుకు బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసిన అందరు పింఛన్‌దారులకు వర్తిస్తుందన్నారు. అదే విధంగా డిబిటి ద్వారా కవర్ కాని మిగిలిన లబ్ధిదారులు 64,338 మందికి ..6లో

బాలలతో భిక్షాటన నేరం

జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్.సూర్య చక్రవేణి

ప్రజాశక్తి - ఏలూరు

బాలలతో భిక్షాటన చేయించడం చట్టరీత్యా నేరమని ఏలూరు జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్.సూర్య చక్రవేణి అన్నారు. ఏలూరు కొత్త బస్టాండ్‌లో బాలలతో భిక్షాటన చేయిస్తున్న ఇద్దరు తల్లులు, ఇద్దరు బాలలను ఏలూరు జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్.సూర్య చక్రవేణి గుర్తించి, డిసిపియు, ఛైల్డ్ హెల్ప్ లైన్ టీమ్ ద్వారా వివరాలు సేకరించారు. వారు తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చి బిడ్డలకు ఆరోగ్యం సరిలేదని ఊరు వెళ్లడంగా బ్యాగులు పోయాయి. దీంతో భిక్షాటనలో కొత్త వరవడి విధానంలో ఎక్కువ డబ్బుల్ని గుంజటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ సందర్భంగా సూర్యచక్రవేణి మాట్లాడుతూ బాలల విద్య వల్ల కలిగే ప్రయోజనాల గురించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. బాలల తల్లిదండ్రులకు బాలలతో భిక్షాటన చేయిస్తే వారిని చట్ట రీత్యా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా బాలలతో భిక్షాటన చేయిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్-1098కి సమాచారం ఇవ్వాలని డాక్టర్ సూర్యచక్రవేణి తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్, డిసిపి సిబ్బంది రాజేష్, రాజ్‌కుమార్, మాధవి, సునీత పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ ఏర్పాటే లక్ష్యం

చింతలపూడి ఇండిపెండెంట్ అభ్యర్థి తొర్లపాటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గంలో చింతలపూడి మండల ప్రధాన కేంద్రంగా మెడికల్ కాలేజీ తీసుకురావటమే లక్ష్యమని ఇండిపెండెంట్ అభ్యర్థి తొర్లపాటి శ్రీనివాసరావు అన్నారు. చింతలపూడి పట్టణంలో ఎం.హోటల్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం చింతలపూడికి వెన్నుముక లాంటిదన్నారు. చింతలపూడి మెట్ట ప్రాంతంలో పామాయిల్ 60 శాతం రైతులు సాగు చేస్తున్నారని, గత పాలకులు టిడిపి, వైసిపి, కాంగ్రెస్ వ్యవసాయాన్ని పట్టించుకోలేదని, వారి సమస్యలు గాలికి వదిలేశారని అన్నారు. మొక్కజొన్న, పత్తి, పామాయిల్ పంటను ఇంకా అభివృద్ధి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

బటన్ నొక్కి డబ్బు కాజేస్తున్న జగన్

టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తూ, బటన్ నొక్కుతూ ఎన్నో వేల కోట్లు దోచివేస్తున్నాడని టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2.70 కోట్లు పేదలకు పంచినట్లు పంచి, మరలా పన్నుల రూపంలో దోచుకుంటున్నాడన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, బిసిలకు పదవులతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు అందాలంటే సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కాట్రేనిపాడు వైసిపి నాయకులు దేవరపల్లి సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి పార్థసారథి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న పార్థసారథి

30 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని జిల్లా ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో ఈనెల 30వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి బిహెచ్.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే విజ్ఞాన శిబిరంలో భాగంగా ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులకు వివిధ రకాలైన పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ విధంగా చేయడం ద్వారా విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెంచటం లక్ష్యంగా పేర్కొన్నారు.

'మే డే'ను జయప్రదం చేయాలి


ప్రజాశక్తి - చింతలపూడి

మే డే కార్యక్రమాన్ని ఒక పండుగలా చేసుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బుచ్చిబాబు ఉద్యోగ, కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. చింతలపూడి సిపిఐ ఆఫీసులో సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడేను ప్రతిఒక్కరూ జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి చేపల్లి శ్రీనివాసరావు, అమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.

వైసిపిలోకి పలువురు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని 13వ వార్డుకు చెందిన పలువురు టిడిపి కార్యకర్తలు సోమవారం ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వారికి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సంక్షేమ పాలన కేవలం జగన్‌కు మాత్రమే సాధ్యమవుతుందని, జగన్ ప్రవేశపెట్టిన పథకాలే జగన్‌ను గెలిపిస్తాయని తెలిపారు.



ప్రచారం నిర్వహిస్తున్న నోబుల్

కొండంగిలో నోబుల్ ప్రచారం

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని కొండంగిలో కాంగ్రెస్ కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి బొడ్డు నోబుల్ విస్తృత ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ రానున్న ఎన్నికల్లో ఇండియా వేదిక బలపరచిన తనను, ఏలూరు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కావూరి లావణ్యను గెలిపించాలని కోరారు. నాయకులు ఈదా పద్మారావు, సైమన్ రాజు, భూషణం, గ్రామ పెద్దలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు ఒకటవ పట్టణంలోని కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల దగ్గరగా గల చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయడమైందని ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జెవిబి నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునన్నారు. ఈ సమయంలో కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలోని వెన్నవల్లివారిపేట, నవాబ్ పేట, సత్యనారాయణ పేట, లంబాడి పేట, భావిశెట్టివారి పేట, నల్లదిబ్బ, కెనాల్ రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, కావున వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

ఉండి: కోలమూరు విద్యుత్ సబ్ స్టేషన్ 33 కేవీ పరిధిలో వార్షిక మరమ్మతులు కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి రైతులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ముఖ్య వార్తలు

మంగళవారం 30 ఏప్రిల్ 2024

కారుమూరి సునీల్ వ్యాఖ్యలు సరికావు

టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శేషు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్ లోకల్, నాన్ లోకల్ నినాదాన్ని తీసుకురావడం సిగ్గు చేటని, ఇటువంటి వ్యాఖ్యలు సరికావని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శేషు అన్నారు. టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో సోమవారం నిర్వ హించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సునీల్‌కుమార్ తండ్రి మంత్రి చేసిన సమయంలో ఎక్కడైనా రివ్యూ కండెక్ట్ చేశారా అని ప్రశ్నించారు. మీరు గెలిస్తే ఏం చేస్తారో చెప్పండని, ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరికోబో మని చెప్పారు. టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి మహేష్ యాదవ్ అనర్గళంగా ఆరు భాషలు మాట్లాడతారన్నారు. ఇంకెప్పుడైనా లోకల్, నాన్‌లోకల్ వ్యక్తి అంటూ మాటలు పేలితే ఊరుకునే వ్యక్తులం కాదని, జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.

'వాలంటీర్లతో బలవంతపు రాజీనామాలు'

జంగారెడ్డిగూడెం టౌన్ : వైసిపికి ఓటమి భయం పట్టుకుందేని, అందుకే వాలంటీర్లతో బలవంతంగా రాజీనామాలు చేయిస్తుందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శేషు అన్నారు. జంగారెడ్డిగూడెంలోని టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి రోషన్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ మీడియా కన్వీనర్ చెరుకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమి విజయం తథ్యమన్నారు. జనసేన నాయకుడు చింతల నాని, మీడియా కో-ఆర్డినేటర్ చెరుకూరి శ్రీధర్ మాట్లాడారు. ఈ సమావేశంలో బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, 15వ వార్డు అధ్యక్షుడు నాయుడు శ్రీనివాస్, ఎస్‌సి సెల్ మండల అధికార ప్రతినిధి తాళ్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకులో కారుమూరి ప్రచారం

ప్రజాశక్తి - తణుకు రూరల్

పట్టణంలోని 4, 5, 6, 17 వార్డుల్లో వైసిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి కారుమూరి వెంకటనాగేశ్వరరావు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99 శాతం హామీలు నెరవేర్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. మేనిఫెస్టోలో చెప్పినవి, చెప్పనవి కూడా అమలు చేసి చూపించారన్నారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు.

'సంక్షేమ పథకాలు అందాలంటే జగనే సిఎం కావాలి'

ప్రజాశక్తి - ముసునూరు

పేద, బడుగు, బలహీనులకు సంక్షేమ పథకాలు అందాలంటే జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని చిల్లబోయినపల్లి గ్రామంలో వారు సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - గణపవరం


మండలంలోని వల్లూరు గ్రామానికి చెందిన పలువురు టిడిపి, జనసేన నాయకులు స్థానిక సొసైటీ అధ్యక్షులు పుల్లేటి నాగరాజు నాయకత్వంలో ఎంఎల్ఎ వాసుబాబు సమక్షంలో సోమవారం వైసిపిలో చేరారు. వారందరికీ వాసుబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఇండియా వేదికతోనే ప్రజలకు మేలు

కాంగ్రెస్ తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బాబ్జి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఇండియా వేదికతోనే ప్రజలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి మర్నిడి శేఖర్ (బాబ్జి) అన్నారు. పట్టణంలోని 5, 6, 7, 8 వార్డుల్లో ఆయన సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ వస్తేనే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు ఆలోచించాలన్నారు. ముఖ్యంగా తాడేపల్లిగూడెం ప్రజలను అర్థం చేసుకునేవారిని, ప్రజలను గౌరవించేవారిని, తాడేపల్లిగూడెం పట్టణాన్ని అభివృద్ధి చేసే నాయకులను ప్రజలు ఎంచుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు.




ప్రచారంలో మర్నిడి బాబ్జి

మేడేను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

మేడేను వాడవాడలా జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు కార్మికులకు పిలుపునిచ్చారు. స్థానిక అమరవీరుల భవనంలో మేడే సన్నాహక సభ సిఐటియు మండలాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ మే ఒకటో తేదీన భవన నిర్మాణ రంగ కార్మికులతో పాటు అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్యకర్తలు, గ్యాస్ ఏజెన్సీ, ఆటో కార్మికులు, హమాలీలు, గ్రామ సేవకులు, ప్రజానీకం స్వచ్ఛందంగా పాల్గొని కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా నాగాంజనేయులు, మండలాధ్యక్షులు పూసల ఏడుకొండలు పాల్గొన్నారు.

వైసిపి నుంచి జనసేన, టిడిపిలోకి భారీ చేరికలు



జనసేన, టిడిపిలో చేరిన కుటుంబాలు

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్రాభివృద్ధి కోసమే టిడిపి కూటమి ఏర్పడిందని ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, డిసిసిబి మాజీ ఛైర్మన్ కరటం రాంబాబు అన్నారు. మండలంలోని నరసింహపురం గ్రామంలో వైసిపి నేత మాదాసు రాంబాబుతో పాటు సుమారు 70 కుటుంబాలు సోమవారం జనసేనలో చేరాయి. డిసిసిబి మాజీ ఛైర్మన్ కరటం రాంబాబు, ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య వారికి జనసేన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అదే విధంగా పోనుకుమడు గ్రామంలో 20 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు చిదరాల మధుబాబు, జనసేన పార్టీ నాయకులు తూము విజయకుమార్, ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్, జనసేన పార్టీ అధ్యక్షులు చంద్రబాబు, మానేపల్లి రాజారావు, కె.నాగరాజు, తిరుపతిరావు పాల్గొన్నారు.

దయాల్‌దాస్‌పేటలో జానీ మాస్టార్ ప్రచారం

ప్రజాశక్తి - మొగల్తూరు

జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా మొగల్తూరు పంచాయతీ పరిధి దయాల్‌దాస్‌పేటలో సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులను కలిసి మాట్లాడారు. జనసేన పార్టీని ఆదరించాలని కోరారు. ముస్లింలకు ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్లను టిడిపి కూటమి వచ్చిన తర్వాత పది శాతం కోసం పోరాడతామన్నారు. కుల, మతాలకు అతీతంగా జనసేన పార్టీ పని చేస్తుందన్నారు. ముస్లింలకు తాను అండగా ఉంటానని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో ముస్లింలకు ఏ పథకాలూ అమలు కావడంలేదన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమిని గెలిపించాలని కోరారు. జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి.మౌలాలిఖాన్, ఎండి షాబాజీ అలాం, ఎండి బాజీ షరీఫ్, ఎండి మహబూబ్‌అలీ, ఎస్‌కె.నూర్‌జాన్, ఎస్‌కె.బాబాజీ, దాసరి కృష్ణాజీ, బొక్క చంటి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే నా విజయానికి తోడ్పాటు

వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహారాజు

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమ పథకాలే తన విజయానికి తోడ్పడతాయని వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహారాజు అన్నారు. మండలంలోని పాములపర్రులో పార్టీ గ్రామ అధ్యక్షులు వర్రే మునలయ్య ఆధ్వర్యంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండేళ్ల నుంచి నియోజకవర్గంలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవడమే కాకుండా సంక్షేమ పథకాలర్హులందరికీ అందాయో లేదో తెలుసుకొని అందనివారికి ఇప్పించామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటేయండి : ముదునూరి

నరసాపురం : రాష్ట్రంలో, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం చూసి వైసిపికి ఓటు వేయాలని ఆ పార్టీ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాద రాజు అన్నారు. మండలంలోని సరిపల్లి గ్రామంలో ఆయన సోమవారం ప్రజ ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను, తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొంగ మురళీకృష్ణ, గమిడి మధుబాబు పాల్గొన్నారు. ప్రసాదరాజు తనయుడు మండలంలోని తూర్పు తాళ్లు గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. పట్టణంలోని 15వ వార్డులో ప్రసాదరాజు సతీమణి శారదవాణి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మనవడిని కొడుతుందనే కోపంలో...

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

తన మనవడిని కొడుతుందనే కోపంలో కోడలి తలపై మామ రోకలిబండతో కొట్టగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని జగన్నాథపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వైజాగ్‌కి చెందిన ఎం.శ్రీనివాస్, సత్యవతి దంపతుల కుమార్తె నాగ శ్రావణిని ఐదేళ్ల క్రితం స్థానిక జగన్నాథపురం గ్రామానికి చెందిన లోక్కోజు కేశవ, కుమారి దంపతుల కుమారుడు శ్రీనివాసరావుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి కుమారుడు రిశాంత్‌కుమార్, కుమార్తె జశ్వితి ఉన్నారు. శ్రీనివాసరావు ఎసి వర్క్ చేస్తుంటాడు. రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి రిశాంత్‌కుమార్ ఒంటికి ఉన్న వెండి మొలతాడు కనిపించకపోవడంతో శ్రావణి పిల్లవాడిని కొడుతుండగా ఆమె అత్తమామలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో కేశవ కోపంతో శ్రావణి తలపై రోకలి బండతో బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మండవల్లి

కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కైకలూరు-ఏలూరు రాష్ట్ర రహదారిపై దెయ్యంపాడు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సాలూరు మండలం కోటపర్రు గ్రామానికి చెందిన చింతాడ అజయ్(30) యాగనిమిల్లులోని ఏలూరుకు చెందిన శివాజీ చేపలచెరువుపై కాపలాదారునిగా గత నెల రోజుల నుంచి పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం కూరగాయలు తెచ్చుకునే నిమిత్తం ద్విచక్రవాహనంపై కైకలూరు వెళ్లాడు. తిరిగి యాగనమిల్లి బయలుదేరాడు. ఈ క్రమంలో దెయ్యంపాడు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన అజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ రామచంద్ర రావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిపై దాడి

ప్రజాశక్తి - కైకలూరు

ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి లావేటి వీర శివాజీపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఆదివారం రాత్రి ఏలూరు రోడ్డులోని ఆయన కార్యాలయంపై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.భాస్కర్‌కు ఫిర్యాదు చేసి తనకు రక్షణ కల్పించాలని, ఎన్నికల నుంచి తప్పుకోవాలని తనకు కొందరు వ్యక్తుల ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

జనసేనకు మద్దతుగా నిలవాలి

పోలవరం ఎంఎల్ఎ అభ్యర్థి బాలరాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

జనసేనకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని ఆ పార్టీ పోలవరం ఎంఎల్ఎ అభ్యర్థి చిర్రి బాలరాజు కోరారు. మండలంలో సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా జబర్దస్త్ ఫేం రామ్‌ప్రసాద్‌తో కలిసి ఆయన రోడ్ షో నిర్వహించారు. మండలంలోని సాయంపాలెం, బొర్రంపాలెం, మధ్యాహ్నపువారిగూడెం, తిరుమలదేవిపేట, శ్రీరామవరం, ఏపికుంట గ్రామాల మీదుగా వారు పర్యటించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. బొర్రంపాలెంలో స్థానికుల కోరిక మేరకు గ్రంథాలయం, హాస్పిటల్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు అడపా నాగరాజు, పోలవరం నియోజకవర్గం పరిశీలకురాలు రావి సౌజన్య, జయ్యవరపు శ్రీ రామమూర్తి, నాయుడు రామకృష్ణారావు గౌడ్, మాలెంపాటి హరిబాబు పాల్గొన్నారు.

పాటోరైటప్ 29 టివిఎన్‌పి1 ఎన్నికల ప్రచారంలో దృశ్యం

పలు గ్రామాల్లో నాయకర్ ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సారవ గ్రామంలో, పట్టణంలోని 26వ వార్డు వీవర్స్ కాలనీలో జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమిని గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజారామ్మోహన్‌నాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఏలూరు నియోజకవర్గం.. ★★★



ఆళ్ల నాని
వైసిపి

బడేటి రాధాకృష్ణ
టిడిపి

బండి వెంకటేశ్వరరావు
సిపిఐ

చింతలపూడి నియోజకవర్గం.. ★★★



కంభం విజయరాజు
వైసిపి

సొంగా రోషన్‌కుమార్
టిడిపి

ఉన్నమట్ల ఎలిజా
కాంగ్రెస్

పోలవరం నియోజకవర్గం.. ★★★



తెల్లం రాజ్యలక్ష్మి
వైసిపి

చిర్రి బాలరాజు
జనసేన

దువ్వెల సృజన
కాంగ్రెస్

దెందులూరు నియోజకవర్గం.. ★★★



కొఠారు అబ్బయ్య చౌదరి
వైసిపి

చింతమనేని ప్రభాకర్
టిడిపి

ఆలపాటి నరసింహమూర్తి
కాంగ్రెస్

ఉంగుటూరు నియోజకవర్గం.. ★★★




పుప్పాల వాసుబాబు
వైసిపి

పి.ధర్మరాజు
జనసేన

పి.హరికుమార్ రాజు
కాంగ్రెస్

నూజివీడు నియోజకవర్గం.. ★★★



మేకా వెంకటప్రతాప్ అప్పారావు
వైసిపి

కొలుసు పార్థసారధి
టిడిపి

మరీదు కృష్ణ
కాంగ్రెస్

మంచి మాట..
నిస్వార్థంగా ఓటు వేయి..
స్వార్థపరులను తరిమేయ్..

సార్వత్రిక సంగ్రామం



ఒక్కరోజు నోటుకు అమ్మితే
నీ ఓటు.. ఐదేళ్లు భవిష్యత్‌కు
తప్పదు భంగపాటు

ఇండియా వేదికతోనే అభివృద్ధి

కాంగ్రెస్ ఉంగుటూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి హరికుమార్‌రాజు

ప్రజాశక్తి - గణపవరం

ఇండియా వేదికతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, మోసపూరిత బిజెపి దాని తొత్తు పార్టీల మాటలు వినకుండా ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సోమవారం కాంగ్రెస్ ఉంగుటూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి పాతపాటి హరికుమార్‌రాజు, సిపిఎం కార్యకర్తలు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికుమార్ రాజు మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వస్తే మతతత్వాన్ని మరింత రెచ్చగొడుతుందన్నారు రానున్న ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని, హస్తం గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని స్థానికులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.పెంటారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు జె.చంద్రశేఖరరావు, ఇండియా వేదిక కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న హరికుమార్ రాజు

దువ్వలో రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి ప్రచారం

ప్రజాశక్తి - తణుకురూరల్

రాష్ట్రంలో ఐదేళ్లుగా అభివృద్ధి శూన్యమని, అరాచకాలు మాత్రం విపరీతంగా చోటు చేసుకున్నాయని తణుకు మాజీ ఎంఎల్‌ఎ, టిడిపి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి అన్నారు. మండలం దువ్వ గ్రామంలో కూటమి తరపున ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతకాని అసమర్థ ప్రభుత్వాన్ని దించేసి, పనిచేసే పాలనను తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. 2014-19 మధ్య కాలంలో అప్పటి ఎంఎల్‌ఎ రాధాకృష్ణ దువ్వ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేశారన్నారు. ఈ ఐదేళ్లలో గ్రామంలో ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదని విమర్శించారు. చంద్రబాబు నాయుడు హయాంలో మహిళా సాధికారత సాధ్యమైందని, డ్వాక్రా సంఘాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయించి ప్రోత్సహించారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా చంద్రబాబు ప్రతిపాదించిన మహిళా శక్తి పథకాలను నారీ లోకం స్వాగతిస్తోందని తెలిపారు. సైకిల్ గుర్తుకు ఓటేసి ఆరిమిల్లి రాధాకృష్ణను, నరసాపురం పార్లమెంట్ నుంచి కమలం గుర్తుపై ఓటు వేసి భూపతిరాజు శ్రీనివాసవర్మను గెలిపించాలని కృష్ణతులసి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిరిశెట్టి వెంకటేశ్వరరావు, దాసరి స్వామి, కట్టా అనంతలక్ష్మి, కట్టా సూర్యారావు, ఆలపాటి కాశీ, ముళ్లపూడి నారాయణ, యన్నమని ఉమామహేశ్వరి, గెద్దా ధనరాజు, కరటూరి సర్వేశ్వరరావు, రుద్రా సతీష్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కృష్ణతులసి

నిడమర్రులో కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - నిడమర్రు

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సోమవారం నిడమర్రు సిపిఎం బృందం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 ఏళ్ల కాలంలో కార్మిక చట్టాల సవరణతో పాటు, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసం వ్యవసాయ నల్ల చట్టాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపిలు ప్రశ్నించడం మాని బిజెపి విధానాలకు మద్దతు తెలుపుతున్నాయన్నారు. ఆయా పార్టీలను ఓడించి ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలగలేటి మోహన, చంద్రరావు, శ్రీనివాసు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నేతలు

భలే మంచి బేరం..!

నాయకులకు తాయిలాల వల

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో రాజకీయం రంజుగా.. పసందుగా మారింది. భలే మంచి బేరం అన్నట్టుగా ఆసక్తి రేకెత్తిస్తోంది. దీంతో గెలుపే లక్ష్యంగా రాజకీయ నాయకులు ఎత్తుకు పైఎత్తు వేస్తూ తాయిలాల ఎర చూపి నేతలను ఆకట్టుకుంటున్నారు. మా పార్టీలోకి రా.. ఏం కావాలో చెప్పు.. ఎంత కావాలో అడుగు.. అనేస్థాయిలో భీమవరంలో రాజకీయాలు సాగుతున్నాయి. ఓహో ఇదే మంచి అవకాశం ఇలాంటి అవకాశం మళ్లీ రాదేమో అని ఏం ఇస్తారంటూ చోటా నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. పార్టీ మారిపోదామా అని మదనపడుతూ.. మారితే సొంత పార్టీ వాళ్లు ఏమంటారో అంటూనే అవతల పార్టీ వాళ్లతో బేరాలు మాట్లాడుతున్నారు. ఇన్ని లక్షలు ఇస్తానంటున్నారు.. మీరెంత ఇస్తారు.. నాకు అప్పులు ఉన్నాయండి.. అప్పులు తీర్చుకోవడానికి వేరే దారి లేదండి అంటూ సొంత పార్టీ నేతలతో నిర్మొహమాటంగా చెబుతున్నారు. అమ్మ బాబోయ్ అంత పెద్ద మొత్తమే.. ఎందుకు మనమే గెలుస్తాం అప్పుడు నీకు మంచి భవిష్యత్తు ఉంటుంది అంటున్నారు స్వపక్షీయులు. అయితే ఆలోచిద్దాంలే ఉండు చూద్దాం అనేసరికి ఇది ఇక్కడ జరిగే పనిలా లేదు. కండువా మార్చడానికి నేను రెడీ అండి నా అప్పులు ఇంత ఉన్నాయి.. నేను మీ పార్టీలో చేరతాను.. నా వెంట వంద మంది వస్తారు. ఎంత ఇవ్వగలరు.. అని డిమాండ్ చేస్తున్న ఘటనలూ ఉంటున్నాయి. తర్వాత బేరాలు కుదిరిన తర్వాత ఇంకా కండువాలు కప్పడమే తరువాయి అయిపోతుంది. మన పార్టీ వాడిని వాళ్లు లాక్కెళ్లిపోతారా మనం తక్కువ తిన్నామా.. మీరు తగ్గొద్దు వెళ్లండి.. ఆ సామాజిక తరగతి ఓట్లు ఎక్కువ ఉంటాయి.. ఆ నాయకుడు వస్తే మనకి, మన పార్టీకి మన గెలుపునకు ఉపయోగపడతాడు.. ఏం కావాలో ఎంత కావాలో బేరం సెట్ చేయండి అంటూ ఈ నాయకులు మొత్తం మీద అధికార ప్రతిపక్ష నాయకులు నిత్యం ఇదే తరహాలో పార్టీలు మారుతున్నారు. దీంతో జంపింగ్ జిలానీలు పెరిగిపోయారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇన్ని డబ్బులు ఖర్చు చేసి కొన్న నాయకులు గెలిపిస్తారా.. ఎవరిని గెలిపిస్తారో వేచి చూద్దాం.



బిసివై ఎంఎల్‌ఎ అభ్యర్థి వెంకటస్వామి ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

రైతులు, కార్మికులు, బలహీన వర్గాలకు తమ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భారత చైతన్య యువజన పార్టీ ఎంఎల్‌ఎ అభ్యర్థి ఆకుల వెంకటస్వామి అన్నారు. వెంకటస్వామి మండలంలోని గొంది గ్రామంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అనంతరం చిట్టవరం, మంగళగుంట పాలెం, కొప్పర్రు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, కూలీలను, కల్లు గీత కార్మికులను కలిసి బిసివై మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ తనను ఎంఎల్‌ఎగా గెలిపిస్తే తాగునీరు, రోడ్ల సమస్యను పరిష్కరిస్తామన్నారు. రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. చెరకు రైతు గుర్తుకు ఓటేసి తనను ఎంఎల్‌ఎగా గెలిపించాలని కోరారు.



ప్రచారం చేస్తున్న ఆకుల వెంకటస్వామి

అభివృద్ధికి కృషి చేస్తాం : చెరుకువాడ

ప్రజాశక్తి - ఆచంట

రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వైసిపి ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల అన్నారు. సోమవారం సాయంత్రం తూర్పుపాలెం కార్యాలయం నుంచి ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఆచంట మండలం శేషమ్మ చెరువు, పెనుగొండ మండలం నడిపూడి, ముళ్లపర్రు, ఇలపర్రు, సిద్ధాంతం మీదుగా పెనుగొండ వరకూ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమత పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. జగన్ ప్రకటించిన సంక్షేమ పథకాలు పేదల అభివృద్ధికి ఎంతో తోడ్పడతాయన్నారు. ఉమ్మడి దోపిడీ కోసం టిడిపి, బిజెపి, జనసేన కుట్ర రాజకీయాలు చేస్తున్నాయని ఆగ్రహం చేశారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఎంపిపి పూతినీడి వెంకటేశ్వరరావు, సర్పంచి జక్కంశెట్టి శ్రీరాములు, మామిడిశెట్టి కృష్ణవేణి, గూడూరి పెద్దరాజు, కర్రి వాసుబాబు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న శ్రీరంగనాథరాజు, ఉమాబాల

కైకలూరు నియోజకవర్గం.. ★★★



దూలం నాగేశ్వరరావు
వైసిపి

కామినేని శ్రీనివాస్
బిజెపి

బొడ్డు నోబుల్
కాంగ్రెస్

ఓటరు మాట

మాటల గారడీ
నమ్మవద్దు
నోటుకు ఓటును
అమ్మవద్దు

ఉండి నియోజకవర్గం.. ★★★



పివిఎల్.నరసింహరాజు
వైసిపి

కె.రఘురామకృష్ణంరాజు
టిడిపి

వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు
కాంగ్రెస్

వి.శివ రామరాజు
ఫార్వర్డ్ బ్లాక్

భీమవరం నియోజకవర్గం.. ★★★



గ్రంధి శ్రీనివాస్
వైసిపి

పులపర్తి రామాంజనేయులు
జనసేన

అంకెం సీతారాం
కాంగ్రెస్

ఆచంట నియోజవకర్గం.. ★★★



చెరుకువాడ శ్రీరంగనాథరాజు
వైసిపి

పితాని సత్యనారాయణ
టిడిపి

ఎన్‌వి.సత్యనారాయణ
కాంగ్రెస్

పాలకొల్లు నియోజకవర్గం.. ★★★



గుడాల గోపి
వైసిపి

నిమ్మల రామానాయుడు
టిడిపి

కొలుకులూరి అర్జునరావు
కాంగ్రెస్

నరసాపురం నియోజకవర్గం.. ★★★



ముదునూరి ప్రసాదరాజు
వైసిపి

బొమ్మిడి నాయకర్
జనసేన

కె.ఉదయ భాస్కర కృష్ణ ప్రసాద్
కాంగ్రెస్

తణుకు నియోజకవర్గం.. ★★★



కారుమూరి నాగేశ్వరరావు
వైసిపి

ఆరిమిల్లి రాధాకృష్ణ
టిడిపి

కడలి రామారావు
కాంగ్రెస్

తాడేపల్లిగూడెం నియోజకవర్గం.. ★★★



కొట్టు సత్యనారాయణ
వైసిపి

బొలిశెట్టి శ్రీనివాస్
జనసేన

మార్నీడి శేఖర్(బాబ్జి)
కాంగ్రెస్


దళితులకు ప్రత్యేకంగా వేసిన వాటర్ వాల్స్

దళితవాడకు తాగునీటి సరఫరా

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి గురజ దళితవాడకు నీటి సరఫరా చేశారు. 'నీరు రాక దళితుల అవస్థలు' అనే శీర్షికతో సోమవారం ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. దీంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి పిడి శ్రీనివాస్ రక్షిత మంచినీటి పథకం నుంచి దళితవాడకు ప్రత్యేకంగా వాల్స్ ఏర్పాటు చేశారు. ఉదయం పంచాయతీ మంచినీటి కుళాయిల ద్వారా దళితవాడకు నీరు సరఫరా చేసినట్లు కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఇకముందు దళితవాడ ప్రజలకు నీటి సమస్య ఏర్పడకుండా అందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

ఆచంట రిటర్నింగ్ అధికారి స్వామినాయుడు

ఆచంట :సార్వత్రిక ఎన్నికల కీలక ఘట్టానికి చేరుకున్న నేపథ్యంలో ఎన్నికల యంత్రాంగం విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు అన్నారు. సహాయ రిటర్నింగ్ అధికారులు పోలింగ్ స్టేషన్లో పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటింగ్ శాతం పెరిగేలా ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా స్విప్ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మెగా బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక ఎంవిఆర్ ప్రభుత్వ కళాశాలలో 20 బృందాలతో శిక్షణ బ్యాలెట్ యూనిట్తో బ్యాలెట్ పేపర్ అమర్చే ప్రక్రియ, సీలింగ్ ప్రక్రియ, వివిపేట్ సీలింగ్ ప్రక్రియ, మాక్ పోల్ నిర్వహణ విధానం అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లతో నిర్వహించినట్లు తెలిపారు.

బిజెపి, మిత్రపక్షాలను ఓడించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రానున్న ఎన్నికల్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపిని, దాని మిత్రపక్షాలను, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన వైసిపిని ఓడించాలని, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు కోరారు. సిపిఐ ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వర రావు విజయాన్ని కాంక్షిస్తూ జరుగుతున్న ప్రచారాన్ని ఓబులేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ ఏలూరు జిల్లా కార్యాల యం స్ఫూర్తి భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా ఎన్డిఎ ముసుగులో భారతదేశ లౌకిక వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి, మత సామరస్యానికి బిజెపి తూట్లు పొడుస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను అంబానీ, ఆదాని వంటి కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా అప్పగిస్తుందన్నారు. బిజెపిని, దాంతో జతకట్టిన టిడిపి జనసేనలకు రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. సంక్షేమ పథకాల ముసుగులో రాష్ట్రాన్ని రూ.లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన వైసిపిని ఓడించాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకరరావు, సిపిఐ ఎంఎల్ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఐ నేతలు


ప్రచారం నిర్వహిస్తున్న జానీ మాస్టర్

'జనసేన కులాలకు అతీతం'

ప్రజాశక్తి - నరసాపురం

ముస్లింల రిజర్వేషన్లు తీస్తే చూస్తూ ఊరుకోమని, జనసేన కులాలకు అతీతమని జనసేన స్టార్ క్యాంపెయనర్, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అన్నారు. పట్టణంలోని పంజాబ్ సెంటర్, దర్గా సెంటర్లో జానీ మాస్టర్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముస్లిం రిజర్వేషన్లు తీయడం అసాధ్యమన్నారు. పుట్టిన గడ్డకు మంచి జరగాలని ప్రచారం చేస్తున్నానన్నారు. ముస్లింల రిజర్వేషన్లు తగ్గితే ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ భారీ మెజారిటీతో గెలుస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలిశెట్టి నళిని, మౌలాలి ఖాన్, తోట అరుణ, బందెల రవీంద్ర, అడబాల రమేష్ పాల్గొన్నారు.


కూటమి హామీలు నమ్మొద్దు

ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎన్నికలు వచ్చినప్పుడల్లా కూటమి పేరుతో కొంతమంది ఎన్నికల్లో పోటీ చేసి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని, దయచేసి ప్రజలు కూటమిని, వారిచ్చే హామీలను నమ్మొద్దని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన పట్టణంలోని 20, 18, 19, 16, 3 వార్డులలో ఆయన పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం పట్టణాన్ని అభివృద్ధి చేసింది తమ ప్రభుత్వమేనన్నారు. ముఖ్యంగా పట్టణంలో 39 వార్డులు ఉండగా ప్రతి వార్డులో కూడా తాము చేసిన అభివృద్ధి కనిపిస్తుందని తెలిపారు. ప్రజలు అభివృద్ధికి, సంక్షేమానికి తిరిగి పట్టం కట్టాలని, ఎంఎల్ఎగా పోటీ చేస్తున్న తనను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గూడూరి ఉమాబాలను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తోట బోగయ్య, మెంటే బలరాం, భోగిరెడ్డి హనుమాన్, గోపిశెట్టి సుబ్బారావు, కోడె విజయలక్ష్మి, యుగంధర్ పాల్గొన్నారు.


ప్రచారంలో అభివాదం చేస్తున్న శ్రీనివాస్


ప్రచారం చేస్తున్న రమేష్

తడికలపూడిలో జెడ్పిటిసి రమేష్ ప్రచారం

కామవరపుకోట :మండలంలోని తడికలపూడి గ్రామంలో కామవరపుకోట జెడ్పిటిసి కడిమి రమేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపికి ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలన చేపట్టినప్పటి నుంచి బడుగు బలహీన వర్గాలను, పేద ప్రజలను గుండెల్లో పెట్టుకొని వారికి సంక్షేమ్మానందిస్తూ, వారి ఆర్థికాభివృద్ధికి అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో తడికలపూడి సర్పంచి కొత్తపల్లి రజినీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలని వినతి

భీమవరం రూరల్ :పాతికేళ్లుగా చాలీచాలని వేతనంతో బతుకుతున్న విద్యుత్ మీటర్ రీడర్స్ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, విద్యుత్ సిఎండి విజయానంద్ ఇచ్చిన ఉత్తర్వులను క్షేత్ర స్థాయి లో వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ పశ్చిమగోదావరి జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు కోరారు. ఈ మేరకు విద్యుత్ మీటర్ రీడర్స్ నాయకులతో కలిసి విద్యుత్ డిఇ కార్యాలయం అధికారి డి.శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కోనాల భీమారావు మీటర్ రీడర్స్ సమస్యలన్నింటిని పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయ కులు ఎం.సీతా రాంప్రసాద్, అసోసియేషన్ జిల్లా కోశాధికారి కె.మల్లేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు పి.జాకబ్, నాయకులు సిర్రా వంశీ, అఖిలరాజు, మునికుమార్, పి.సుధాకర్ పాల్గొన్నారు.

కొల్లేరు ప్రజలకు అండగా ఉంటాం

(మొదటి పేజీ నుంచి)

వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్కు పవన్ హెలికాప్టర్లో చేరుకున్నారు. నాయకులతో కొద్దిసేపు మాట్లాడిన అనంతరం రోడ్ షోగా గణపవరం పోలీస్ బొమ్మ సెంటర్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు రాత్రి ఏడు గంటలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కొల్లేరులో పారిశ్రామిక కాలుష్యం పెరిగిపోయిందన్నారు. సైబేరియన్ కొంగలు రావడం లేదన్నారు. శుద్ధి చేసిన తర్వాత పరిశ్రమల నుంచి వ్యర్థాలు వదలాలని, వదిలే విధంగా పోరాటం చేస్తామన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో వంతెనలు, రహదారులు దెబ్బ తిన్నాయని తెలిపారు. దీంతో ఆక్వా ఎగుమతులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. కూటమి అధికారంలోకొచ్చాక నారాయణపురం, గుండుగొలను వంతెనలను పున:నిర్మిస్తామన్నారు. డెల్టాలో తాగేందుకు గుక్కెడు నీళ్లు లేవని, మద్యం మాత్రం ప్రతి ఇంటికీ అందుతుందన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 81 గ్రామాల్లో 64 గ్రామాలకు తాగునీటి ఇబ్బంది ఉందన్నారు. జనసేన అభ్యర్థి ధర్మరాజు సేవా దృక్పథంలో తాగునీరు అందిస్తున్నారన్నారు. గోదావరి నుంచి రక్షిత నీరు అందించాల్సి ఉందన్నారు. పోలవరం పూర్తయ్యే వరకూ ఏలూరు కెనాల్ నుంచి తాత్కాలికంగా తాగునీరు అందించాలన్నారు. రంగులు వేయడానికి డబ్బు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం కాల్వల్లో పూడిక తీయడం లేదన్నారు. పోలవరం కుడి కాలువ మట్టిని అమ్మేసుకుంటున్నారన్నారు. సమస్యలు పరిష్కరించాల్సిన ఉంగుటూరు ఎంఎల్ఎ వాసుబాబు పేకాట క్లబ్ల్లో బిజీబిజీగా గడుపుతున్నారంటూ విమర్శించారు. పేకాట క్లబ్లవాళ్లు రూ.30 లక్షల కారు ఎంఎల్ఎకు ఇచ్చారని ఆరోపించారు.

ఆక్వా రైతులకు తీరని నష్టం

ఆక్వా ఛార్జీలు, సీడ్, ఫీడ్ ధరలు పెంచేసి ఆక్వా రైతులను ఆగాధంలో ముంచేశారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సొమ్మును తినేశారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్తో మీ భూములు మీకు దక్కకుండా పోతాయని తెలిపారు. రోడ్ల సమస్య తీవ్రంగా ఉందని, అత్యధిక రోడ్డు ప్రమాదాలు ఎపిలోనే జరుగుతున్నాయన్నారు. నిడమర్రులోని భీమేశ్వర ఆలయం భూముల్లో చెరువులు తవ్వుకుని లీజులు కట్టడం లేదన్నారు. దేవుడిమాన్యం టచ్ చేస్తే తీవ్రంగా దెబ్బతింటారని హెచ్చరించారు. స్థానిక వైసిపి నాయకులు జనసేన, టిడిపి కార్యకర్తలపై దౌర్జన్యాలు చేస్తున్నారని, తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదన్నారు. టిడిపి టిక్కెట్ ఇప్పించలేదని మంత్రి కొట్టు సత్యనారాయణ తనపై కక్షగట్టారన్నారు. త్వరలోనే కొట్టు కట్టే సమయం ఆసన్నమైందని పవన్ వ్యాఖ్యానించారు. వ్యాపారులు కె ట్యాక్స్ బారి నుంచి బయటపడాలంటే దమ్మున్న నాయకులు బొలిశెట్టి గెలిపించాలని కోరారు. దేవస్థానం దర్శనం టికెట్లు కొట్టు అమ్మేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్, బిజెపి నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి నేత గన్ని వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులను నిండా ముంచారు

(మొదటి పేజీ నుంచి)

హస్యాస్పదమన్నారు. కొయ్యలగూడెంలో వైఎస్ఆర్ హయాంలో 30 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేశారని, ప్రస్తుత ప్రభుత్వం దాన్ని ఆరు పడకల ఆసుపత్రిగా చేసిందని ఎద్దేవా చేశారు. జగన్ ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా, కనీసం నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగులను దగా చేశారన్నారు. రైతుల పంటలకు మద్దతు ధర కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య, పోలవరం ఎంఎల్ఎ అభ్యర్థి దువ్వెల సృజన మాట్లాడుతూ గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలివ్వలేదని విమర్శించారు. గ్రీన్ఫీల్డ్ హైవే పేరుతో రైతులను మోసం చేశారన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచుతూ ఓట్ల రాజకీయం చేయడం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేత కె.శ్రీనివాస్, చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా, ఏడు మండలాల నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం సచివాలయానికి రానక్కర్లేదు

(మొదటి పేజీ నుంచి)

రూ.18.96 కోట్లు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికి పంపిణీ చేస్తామన్నారు. విభిన్నప్రతిభావంతులు, తీవ్రమైన వ్యాధులు కేటగిరి కింద పింఛన్లు వారికి ఇంటికెళ్లి పంపిణీ చేస్తారన్నారు. ఎవరికి బ్యాంకు ఖాతాకు నగదు జమ చేస్తారు, ఎవరికి ఇంటింటికీ పంపిణీ చేస్తారనేది సచివాలయాల్లో జాబితాలు ప్రదర్శిస్తారని తెలిపారు. అదే విధంగా హెల్ప్ డెస్క్ను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మే మొదటి తేదీనే సుమారు 77.5 శాతం మందికి డిబిటి ద్వారా పంపిణీ జరుగుతుందన్నారు. మిగిలిన 22.5 శాతం మందికి నేరుగా వారి ఇంటి వద్దే పెన్షన్ల పంపిణీ జరుగుతుందన్నారు. బ్యాంకు ఖాతాలకు జమ చేసిన సమయంలో రిజెక్టు అయిన వారికి మళ్లీ ఇంటికే పంపిణీ చేస్తారన్నారు. పెన్షన్లు పంపిణీ చేసేటప్పుడు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉండాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఇప్పటికే ఆదేశించామన్నారు.

ఇక సమరమే..!

(మొదటి పేజీ నుంచి)

13 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

తాడేపల్లిగూడెంలో 13 మంది నామినేషన్లను ఆమోదించారు. ఎవరూ నామినేషన్లు ఉపసంహరించుకోకపోవడంతో 13 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు.

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో నామినేషన్ల స్క్రూట్నీ అనంతరం 99 మంది నామినేషన్లు ఆమోదించారు. అయితే కేవలం 10 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో ఏడు అసెంబ్లీ స్థానాల్లో 89 మంది అభ్యర్థులు పోటీలో నిలిచినట్లు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు.

ఏలూరు జిల్లాలో ఒక ఎంపీ, ఏడు ఎంఎల్ఎ స్థానాలకు 99 మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రకటించారు.

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

ఇక ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 12 మంది, దెందులూరు నియోజకవర్గంలో 15 మంది, ఏలూరు నియోజకవర్గంలో 14 మంది, పోలవరం నియోజకవర్గంలో 12 మంది, చింతలపూడి నియోజకవర్గంలో 8 మంది, నూజివీడు నియోజకవర్గంలో 10 మంది, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

నూజివీడు నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన టిడిపి రెబల్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు సోమవారం తన నామినేషన్ ఉపసంహరించుకోవడంతో ఏలూరు జిల్లాలో వైసిపి, టిడిపి కూటమి, ఇండియా వేదిక అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లాలో మాత్రం ఉండి నియోజకవర్గంలో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా బరిలోకి దిగిన టిడిపి రెబల్ వేటుకూరి వెంకట శివరామరాజు (శివ) బలమైన అభ్యర్థి కావడంతో చతుర్ముఖ పోటీ నెలకొంది.

నేడు సాధారణ కౌన్సిల్

ప్రజాశక్తి - నరసాపురం

ఈనెల 30వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు సాధారణ కౌన్సిల్ సమావేశం పురపాలక సంఘంలో జరగనున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ బర్రి వెంకట రమణ తెలిపారు. కౌన్సిల్ సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

'రాష్ట్రాభివృద్ధి టిడిపి, జనసేనతోనే సాధ్యం'

ప్రజాశక్తి - మొగల్తూరు

అంధకారంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే టిడిపి, జనసేనలతోనే సాధ్యమని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని ముచ్చలపల్లి గ్రామంలో జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి జనసేన ఎన్నికల మేనిఫెస్టో వివరించారు. తొందర్లో జరిగిన ఎన్నికల్లో జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్, ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసపురం ఆదరించాలని కోరారు. ఈ ప్రచారంలో పొత్తూరి రామరాజు, గుబ్బల నాగరాజు, నాగిడి రాంబాబు, నిప్పులేటి తారకరామారావు, వాతాడి కనకరాజు, బందెల రవీంద్ర, వాటల సత్యనారాయణ, దొంగ సత్యనారాయణ, బొక్క చంటి, దాసరి కృష్ణాజి, ఉప్పులూరి రాంబాబు, అద్దాల రమేష్, దొంగ స్వామి, ముక్కుగిరి, కొల్లాటి పెంటయ్య, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఛార్జిషీట్‌లో వైఎస్ పేరును చేర్చింది జగనే

టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ళ

చార్జిషీట్‌లో కీర్తిశేషులు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరును చేర్చింది ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డేనని టిడిపి నరసాపురం ఎంపీ, ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి రఘురామకృష్ణంరాజు అన్నారు. సోమవారం పెదఅమిరంలో రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ జైలు నుంచి బయటకు రావడం కోసమే ఉద్దేశపూర్వకంగా రాజశేఖర్ రెడ్డి పేరును చార్జిషీట్‌లో చేర్చిన ఘనత జగన్మోహన్ రెడ్డి దేనన్నారు. మళ్లీ జగన్మోహన్ రెడ్డిని అధికారంలోకి రానిస్తే ప్రజల ఆస్తులు స్వాహా చేస్తారని ఆయన హెచ్చరించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మోపిన రాజ ద్రోహంతో పాటు, ఇతర కేసులు కాకుండా గతంలోనూ నాపై ఆ కేసులు ఉన్నాయని గుర్తు చేశారు. మరి అప్పుడు నాకు సీటు ఎలా ఇచ్చారని జగన్‌ని ప్రశ్నించారు. ఇలాగే తప్పుడు ప్రచారాన్ని చేస్తే తాను కూడా ఇంకా ఎక్కువ మాట్లాడాల్సి వస్తుందని హెచ్చరించారు. శివరామరాజును టిడిపి ముసుగులో ఇండిపెండెంట్‌గా బరిలోకి దించాలన్న ఎత్తుగడను ప్రజలు అప్పుడే పసిగట్టారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర రాజకీయ చిత్రపటం నుంచి తనని ప్రజలు బహిష్కరించడం ఖాయమని తెలిపారు.

'విద్యా ప్రోత్సాహం' సేవలు స్ఫూర్తిదాయకం

జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాల రావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పదం కుమార్ విద్యా ప్రోత్సాహం సేవలు స్ఫూర్తి దాయకమని లయన్స్ 316 జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాల రావు అన్నారు. స్థానిక లయన్స్ కార్యాలయంలో డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్స్ కొప్పిశెట్టి రమణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లయన్స్ పదం కుమార్ గుప్తా విద్యా ప్రోత్సాహం ద్వారా తాడేపల్లిగూడెం నియోజకవర్గం ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో అత్యున్నత మార్కులు సాధించిన నల్లా ప్రియ 586, లక్ష్మి సాయి ప్రసన్న 580లకు సత్కారం చేసి లయన్స్ మెమెంటో, బుక్స్ అందించారు. జోన్ ఛైర్‌పర్సన్ లయన్స్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ లయన్స్ విద్యా ప్రోత్సాహంలో ఎంపికైన విద్యార్థులకు కళాశాలలో విద్యకు కూడా నగదు ప్రోత్సాహం అందిస్తామన్నారు. క్లబ్ అధ్యక్షులు కొప్పిశెట్టి రమణయ్య మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యకు ప్రోత్సాహం అందించవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఛైర్మన్ లయన్స్ కాళ్ల గోపికృష్ణ, ఎమ్.ప్రసాద్, లయన్స్ చెన్నా రెడ్డి సతీష్, లయన్స్ తిరుమల్ల పాండు రంగా రావు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధన కాంగ్రెస్‌తోనే

కాంగ్రెస్ తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి కడలి రామారావు


రైతులతో మాట్లాడుతున్న రామారావు

ప్రజాశక్తి - తణుకు

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి కడలి రామారావు అన్నారు. సోమవారం తణుకు మండలం దువ్వ కోణాల, ముద్దాపురం, ఇరగవరం మండలం కొత్తపాడు ఇరగవరం, గోటేరు, అయినపర్రు, ఓగిడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పొలాల్లో రైతులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. బిజెపితో పొత్తు పెట్టుకున్న పార్టీలను ఓడించాలని అన్నారు. వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని తెలిపారు. ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి బుజ్జి

ప్రజాశక్తి - మొగల్తూరు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రజల సమస్యల పరిష్కారం ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి ఉదయ భాస్కర కృష్ణప్రసాద్(బుజ్జి) అన్నారు. సోమవారం సాయంత్రం మొగల్తూరులోని సిపిఎం నాయకులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి షాప్‌కి వెళ్లి కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలు ప్రజలకు అందించి, వాటిని వివరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, నిరుద్యోగం, తదితర సమస్యల పరిష్కారం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఇండియా వేదిక అభ్యర్థులు ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఒక రంగంలోనే కాదు, అన్ని రంగాల్లోనూ వెనకబడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బిజెపికి ఒక్క సీటు కూడా ఇవ్వకుండా ప్రజలు తిరస్కరించారని తెలిపారు. రాష్ట్రానికి నిధులు, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న బిజెపికి ఓటు హక్కుతో బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలంతా


ప్రచారం నిర్వహిస్తున్న బుజ్జి


ఆలోచించి కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం రైతులకు రుణమాఫీ రూ.2 లక్షల వరకు చేస్తామన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు కనీస వేతనం రూ.400 ఇవ్వలేని వారికి రూ.5 లక్షలతో ఇల్లు నిర్మాణం, అన్నదాతలకు 50 శాతం లాభంలో మద్దతు ధర, ఉచిత విద్య, వృద్ధులకు, వితంతువులకు పెన్షన్లు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ ప్రచారంలో సిపిఎం నాయకులు కవురు పెద్దిరాజు, యడ్ల చిట్టిబాబు, ముప్పల రాజారావు, ఆదూరి సాంబమూర్తి, కాంగ్రెస్ నాయకులు మల్లిపూడి శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

నియోజకవర్గంలో ఉన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజు హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కుముదవల్లి, విస్సాకోడేరు, గొరగనమూడి, పెన్నాడ అగ్రహారం, శృంగవృక్షంలో ఆయన సోమవారం పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లను


మాట్లాడుతున్న రఘురామకృష్ణంరాజు

అభ్యర్థించారు. తన గెలుపుకు సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో లేనిపోని హామీలు ఇస్తున్న పార్టీలను నమ్మొద్దని, టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు అభివృద్ధికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


ఓటు హక్కుపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు

ఓటు హక్కు అందరి బాధ్యత

ఎంపిడిఒ పి.నరసింహ ప్రసాద్

ఆచంట: సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ పి.నరసింహ ప్రసాద్ అన్నారు. 'ఓటు హక్కు అందరి బాధ్యత' అనే నినాదంతో సోమవారం విద్యార్థులతో వివిధ శాఖల అధికారులు ఆచంట పురవీధుల గుండా 'మీ భవిష్యత్ మీ ఓటుతో' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు. ఈ ర్యాలీ స్థానిక తహశీల్దార్ కార్యాలయం పోలీస్ స్టేషన్ నుంచి కచేరి సెంటర్, ఆచంట పురవీధుల గుండా వివిధ శాఖల అధికారులు ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన నిమిత్తం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ, రాష్ట్ర భవిష్యత్తుకు ఓటే పునాది అన్నారు. తమ ఓటు హక్కును దుర్వినియోగం చేసుకోవద్దని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఐపిశెట్టి, ఇఒపిఆర్‌డి మూర్తి బాబు పాల్గొన్నారు.

ఘనంగా రాజా రవివర్మ జయంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చిత్ర కళా రంగంలో రాజా రవివర్మ ఆద్యుడని, భారతదేశ చిత్రకారునిగా రామాయణ, మహాభాగవత ఘట్టాలను చిత్రాలుగా చిత్రీకరించారని, అవి ఈనాటికీ చెరగని ముద్రలుగా చరిత్రలో ఉన్నాయని అరసవల్లి ఈశ్వరమ్మ వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ అరసవల్లి సుబ్రమణ్యం అన్నారు. సోమవారం ప్రఖ్యాత భారతీయ చిత్రకారుడు రాజా రవి వర్మ జయంతోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో చిత్రకళలో ప్రముఖ చిత్రకారులకు అరసవల్లి ఈశ్వరమ్మ వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్, శ్రీవిజ్ఞానవేదిక సంయుక్త ఆధ్వర్యంలో బివి.రాజు మున్సిపల్ పార్క్ ప్రాంగణంలో సత్కరించారు. రాజా రవవర్మ స్ఫూర్తితోనే అనేక మంది దేశ వ్యాప్తంగా చిత్రకారులుగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. అనంతరం చిత్రకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు పండితులు కలిగొట్ల గోపాల శర్మ, డిఆర్.నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - ఆచంట

ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం ఆచంట మండలంలో సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను పోలీస్ అబ్జర్వర్లు, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో కొడమంచిలి, ఆచంట వేమవరం, వల్లూరు, ఆచంట తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలుగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను పోలీస్ అబ్జర్వర్ శైలేష్ కుమార్ సిన్హా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు, ఇతర వసతులపై ఆరా తీశారు. సమస్యాత్మక గ్రామాలుగా ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

పెనుగొండ: మండలంలోని సమస్రాత్మకమైన పోలింగ్ బూత్‌లను పోలీస్ అబ్జర్వర్ శైలేష్ కుమార్ సిన్హా సోమవారం పరిశీలించారు. ఆచంట నియోజకవర్గంలోని గ్రామాలు పెనుగొండ, వడాలి, రామన్నపాలెం, ములపర్రు, దేవ, పోలింగ్ బూత్‌లను సందర్శించి తగు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. పెనుగొండ ఎస్ఐ షేక్ సుభాని, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని వినియోగించుకోవాలి

వాసవి క్లబ్ జోన్ ఛైర్మన్ సత్యనారాయణ మూర్తి

ప్రజాశక్తి - ఆచంట

ఆర్యవైశ్య సంఘం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా దృక్పథంతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్ర కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వాసవి క్లబ్ జోన్ ఛైర్మన్ పచ్చిగోళ్ళ సత్యనారాయణ మూర్తి అన్నారు. ఆచంట మండలం కొడమంచిలి గ్రామంలో ఆర్యవైశ్య రామాలయం వద్ద ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ చలివేంద్ర కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలుగా కొడమంచిలి గ్రామంలో ప్రతి ఏటా వేసవికాలంలో మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్నామన్నారు. ఆర్యవైశ్య వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తూ ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడమంచిలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బాలనాగు శ్రీనివాసరావు, వాసవి క్లబ్ అధ్యక్షులు కాజా వెంకటేశ్వరరావు, కొల్లేపల్లి సాయిబాబా, కొల్లిపర వెంకన్న బాబు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

పెనుగొండలో టిడిపి ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండలో సర్పంచి శ్యామల సోని ఆధ్వర్యంలో ఇంటింటికీ టిడిపి ప్రచార కార్యక్రమం పితాని సత్యనారాయణ నిర్వహించారు. సోమవారం ఆయన ఇంటింటా తిరుగుతూ కోడిపందాలు దెబ్బని 19 వార్డులో టిడిపి, జనసేన నాయకులు, కార్యకరర్తలు ప్రచారం నిర్వహించారు.

ఉండిలో 4 నామినేషన్లు ఉపసంహరణ

ప్రజాశక్తి - ఉండి

ఉండి నియోజకవర్గంలో సోమవారం నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో 13 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సివి.ప్రవీణ్ఆదిత్య తెలిపారు. నామినేషన్ ఉపసంహరించుకున్న వారిలో భారతీయ చైతన్య యువజన పార్టీ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి గుడిగంట వెంకటేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థులు తోటకూర సుధీర్ వర్మ, ఇందుకూరి నవీన్వర్మరాజు, వేగేశ్న సూర్యనారాయణరాజు ఉన్నారని తెలిపారు.

కైకలూరులో ముగ్గురు..

ప్రజాశక్తి - కైకలూరు

కైకలూరు నియోజకవర్గంలో మొత్తం 35 మంది అభ్యర్థులు 44 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. పరిశీలనలో వివిధ కారణాల రీత్యా ఐదుగురు సభ్యులను ఎన్నికల అధికారులు తొలగించారు. సోమవారం వివిధ పార్టీలకు చెందిన ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. వీరిలో తిరువీధుల శారద, చింతాడ శ్రీనివాసరావు, బిజెవైఎం పార్టీ నుంచి పాముల ఏసుపాదం ఉన్నారు. దీంతో 15 మంది అభ్యర్థులతో తుది జాబితా సిద్ధమైంది.

ముద్దరబోయిన నామినేషన్ ఉపసంహరణ

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు స్వతంత్ర్య అభ్యర్థి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. ఈ నెల 18వ తేదీన ముద్దరబోయిన స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో టిడిపి అధిష్టానం ముద్దరబోయిన వెంకటేశ్వరరావుతో చర్చలు జరిపింది. ఈ క్రమంలో ముద్దరబోయిన వెంకటేశ్వరరావు సోమవారం తన నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకున్నార. అనంతరం ప్రజాగళం ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో భాగంగా కర్నూలులో ఉన్న చంద్రబాబును కలిసి టిడిపిలో చేరేందుకు బయలుదేరి వెళ్లారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరా : వెంప దుర్గ

ప్రజాశక్తి - చింతలపూడి

నియోజకవర్గ అభివృద్ధి కోసం, మార్పు కోసం కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వెంప దుర్గ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తాను చింతలపూడి స్వతంత్ర ఎంఎల్ఎ అభ్యర్థిగా నామినేషన్ వేశానని చెప్పారు. కానీ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆహ్వానం మేరకు నియోజకవర్గ సమస్యలను చర్చించానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కొన్ని డిమాండ్లను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృష్టిలో పెట్టానని చెప్పారు. వాటికి కాంగ్రెస్ పార్టీ వారు సుముఖత తెలియజేసినట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్ర డిప్యూటీ సిఎం డికె.శివకుమార్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ఎపి పిసిసి అధ్యక్షురాలు షర్మిల అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీలో విశాఖపట్టణంలో చేరినట్లు ఆయన తెలిపారు. తనతో పాటు ఉంటే తన వెన్నంటే నడిచినవారు, తనను ప్రోత్సహించినవారి అభిప్రాయాల మేరకు చేరినట్లు చెప్పారు.

ఫైనల్ రేసులో ముగ్గురు నాయకర్లు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం అసెంబ్లీ స్థానానికి 14 మంది 25 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో ఇద్దరి నామినేషన్లు రిజెక్ట్ అవ్వగా పోటీలో 12 మంది ఉన్నారు. నాయకర్ సోదరుడు బొమ్మిడి సునీల్ నాయకర్ విత్ డ్రా చేసుకున్నారు. 11 మందిలో నాయకర్ పేరు కలిగిన వారు ముగ్గురు ఉన్నారు. జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌తో పాటు జాతీయ జనసేన తరపున అభ్యర్థిగా పాలెపు సత్యలింగ నాయకర్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున కొల్లి సత్యనాయకర్ నామినేషన్లు దాఖలు చేశారు. పాలెపు సత్యలింగనాయకర్ స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కాకినాడ. కొల్లి సత్యనాయకర్ స్వస్థలం నరసాపురం పట్టణంలోని మూడో వార్డు కావడం విశేషం. ఇప్పటికే ముగ్గురు ఒకే పేర్లు కలిగి ఉండడంతో పాటు కొందరి ఎన్నికల గుర్తులు కూడా ఒకేలా ఉన్నాయి. జనసేన అభ్యర్థి బొమ్మిడి నారాయణ నాయకర్ గాజు గ్లాస్ గుర్తు, జాతీయ జనసేన అభ్యర్థి పాలెపు సత్యనాయకర్ గుర్తు పెన్ స్టాండ్, నవరంగ్ కాంగ్రెస్ అభ్యర్థి కొల్లి సత్యనాయకర్ గుర్తు బకెట్ కేటాయించారు. దీనిపై నియోజకవర్గంలో చర్చ నడుస్తోంది.

రాజ్యాంగ మౌలిక సూత్రాలపై దాడిని వ్యతిరేకించండి

ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు

ప్రజాశక్తి - తణుకు రూరల్

రాజ్యాంగ మౌలిక స్వరూపాలైన ఫెడరలిజం, సెక్యులరిజం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, స్వతంత్ర న్యాయవ్యవస్థలపై దాడి జరుగుతుందని, ఇటువంటి వాటిని తిప్పి కొట్టాలని శాసనమండలి సభ్యులు కెఎస్.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. స్థానిక మెడికల్ హాలులో శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం, తణుకు స్టడీ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ-కర్తవ్యాలు అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ 2029 నాటికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కొనసాగిస్తారా లేదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. ప్రాథమిక హక్కుల ద్వారా ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కల్పించాలని, సంక్షేమ రాజ్యస్థాపన జరగాలని, భారతదేశ భిన్నత్వమూ, సమగ్రతా కాపాడబడాలని రాజ్యాంగం నిర్దేశించిందన్నారు. కాని ఇప్పుడు రాజ్యాంగ వ్యవస్థలపైనే దాడి జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన సామాజిక న్యాయానికి, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నేటి కేంద్ర పెద్దలు మాట్లాడుతున్నారన్నారు. మైనారిటీ, దళితులపై దాడులు గత పదేళ్ల కాలంలో పెగిరిపోయాయన్నారు. మణిపూర్‌లో రిజర్వేషన్ల పేరుతో కుకీలు-మెయితీల మధ్య చిచ్చు రాజేయడమే దీనికి ఉదాహరణ అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లో మతపరమైన విభజన తెచ్చి ఓటు బ్యాంకు రాజకీయాలకు తెగబడుతూ సెక్యులర్ స్వభావానికి విఘాతం కలిగిస్తున్నారన్నారు. అన్ని మతాలను సమానంగా చూడాలని రాజ్యాంగం లౌకికతత్వాన్ని ప్రభోదించిందని, కాని ఏక పౌరస్మృతి సిఎఎ, ఎన్ఆర్‌సిల అమలుకు పూనుకుంటుందని విమర్శించారు. సెక్యులర్ అన్న పదాన్నే సహించలేకపోతున్నారని, అందుకే రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని పూర్తిగా మార్చే ప్రయత్నాలను మేధావులు, విద్యావేత్తలు, ప్రజాసంఘాలు, ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ పి.దక్షిణామూర్తి, ప్రముఖ సామాజికవేత్త, తణుకు స్టడీ సర్కిల్ కన్వీనర్ డివివిఎస్.వర్మ, ఆలిండియా లాయర్స్ యూనియన్ ఉభయగోదావరి జిల్లాల కార్యదర్శి కామన మునిస్వామి, ఎండి అబ్దుల్ రహమాన్, పేరూరి మురళీకుమార్, పలు సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి : డిఎస్‌పి


మాట్లాడుతున్న డిఎస్‌పి జి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నరసాపురం

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా మంచి సమాజాన్ని నిర్మించుకోవచ్చని డిఎస్‌పి జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వైఎన్ కళాశాలలో పోలీసు డిపార్ట్‌మెంట్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు రానున్న ఎన్నికల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సిసి కెడేట్లకు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం, ఎన్నికల డ్యూటీ చేసేవారికి విధులపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎస్‌పి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుకునే వయసులో కష్టపడి చదువుకుంటే జీవితంలో సుఖపడొచ్చని, మంచి విజయాలు సాధించవచ్చని చెప్పారు. ఇప్పుడు సుఖ పడతామని అనుకుంటే జీవితాంతం కష్ట పడాలన్నారు. విద్యార్థులు ఎటువంటి వ్యసనాలకు బానిసలు కాకుండా కష్టబడేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా మనం మంచి సమాజాన్ని నిర్మించుకోవచ్చని, అంతే కాకుండా మన దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే అవకాశం ఒక్క ఓటుతోనే సాధ్యమవుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సిసి కెడేట్లకు రానున్న ఎన్నికల్లో బూత్ వద్ద విధులు నిర్వహించే అవకాశాన్ని కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులు ఎన్నికలపై అవగాహన కల్పిస్తూ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్, ఎన్‌సిసి కెడేట్స్ ఎన్నికల విధులు నిర్వహించేవారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటును సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందన్నారు. నరసాపురం సిఐ కెఎ.స్వామి మాట్లాడుతూ ఓటు వేయడాన్ని విద్యార్థులు తమ బాధ్యతగా భావించి, ఓటు హక్కునును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌విఎస్.సాయిబాబా, కళాశాల డీన్ డాక్టర్ గంధం రామకృష్ణ, ఇంగ్లీష్ విభాగం అధిపతి సిహెచ్.సోమేశ్వరి, ఎన్ఎస్ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.యాకోబ్, ఎన్‌సిసి ఆఫీసర్లు ఎన్‌వివి.రమణ రామారావు, జి.శ్యాంబాబు, జి.సునీత పాల్గొన్నారు.

ఇండియా వేదికతోనే ప్రజాస్వామ్య హక్కులకు రక్షణ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్, ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశంలో ప్రజాస్వామ్య హక్కులు రక్షించబడాలన్నా, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నా బిజెపి, దానికి మద్దతిస్తున్న పార్టీలను ఓడించాలని, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంఆర్‌సి కాలనీ, తిలక్ కాలనీ, రాణి నగర్, ఇజ్రాయిల్‌పేట, లంకపేట తదితర ప్రాంతాల్లో బండి వెంకటేశ్వరరావు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం గత పదేళ్లుగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, కరెంటు ఛార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారాల మోపిందని విమర్శించారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించి మూడు నల్ల చట్టాలు తెచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. మళ్లీ బిజెపికి అధికారం కట్టబెడితే అంబేద్కర్ రాసిన లౌకిక రాజ్యాంగాన్ని మార్చేస్తామని బిజెపి ప్రకటిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఏలూరు కార్యదర్శి పి.కిషోర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ దండుబోయిన చంద్రశేఖర్, సిపిఐ నగర కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఉపాధి హామీ కూలి రూ.600 ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ఉపాధి హామీ కూలీలకు రూ.600 కూలి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. మండలంలోని కొమ్ముగూడెంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఉపాధి హామీ పని ప్రాంతాలను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పనిలో భాగంగా గునపాలకు సాన పెట్టడానికి గతంలో ఇచ్చినట్లు రూ.50 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, వెంకట్రావు, చింతరావు పాల్గొన్నారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

సాధారణ ఎన్నికల పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాతక్, ఎస్ఎ.రామన్ సమక్షంలో పోలింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లా పరిధిలోని 1751 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బందిని కేటాయించామన్నారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఎన్నికల సిబ్బందిని కేటాయించామని తెలిపారు. 1926 ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 1926 అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 6689 ఇతర పోలింగ్ సిబ్బంది కలిపి మొత్తం 10,541 మందిని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించామన్నారు. ఎన్నికల విధులపై వీరికి త్వరలో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని, ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియలో పోలింగ్ సిబ్బందిని బూత్‌ల వారీగా కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ డి.పుష్పమణి, డిఇఒ ఎస్.అబ్రహం, ఎన్ఐసి అధికారి శర్మ, కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.